## క్లుప్తంగా

### విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



పి.నైనవరం(విజయవాడరూరల్): సంక్రాంతి సందర్భంగా శనివారం పి.నైనవరంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 4 నుంచి 8వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం స్త్రీలకు ముగ్గుల పోటీలు జరిగాయి. కార్యక్రమంలో లిటిల్ ఏంజెల్స్ స్కూల్ కరస్పాండెంట్ ఇమ్మానుయేల్, మౌంట్ కర్మెల్ స్కూల్ కరస్పాండెంట్ అవినాష్, డీవైఎఫ్‌ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

### గంగూరులో వైఎస్సార్ బీమా అందజేత



పెనమలూరు: గంగూరులో బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమాను అందజేశారు. గ్రామం సచివాలయం 2కు చెందిన చేబ్రోలు అర్జునరావు ఈ నెల 11న మృతి చెందాడు. అతని కుటుంబానికి తక్షణ సాయం కింద ప్రభుత్వం రూ.10 వేలు మంజూరు చేయడంతో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అక్బర్‌పాషా బీమా సొమ్మును మృతుడి భార్య చేబ్రోలు కృష్ణవేణికి అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చేబ్రోలు పావని, జోజిబాబు, సచివాలయ సిబ్బంది డొక్కు దుర్గ, ఎస్.రాజేష్ బాబు, వలంటీర్ సునీత, పాల్గొన్నారు. సర్పంచి తస్లీమెస్నీసా రూ.2 వేలు అందజేశారు.

### 150 మందికి అన్నదానం



విజయవాడరూరల్: సంక్రాంతి పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ పి.నైనవరం కన్వీనర్ దావు వెంకటేశ్వరరావు శనివారం విజయవాడలోని రైల్వేస్టేషన్, లోబ్రిడ్జి, గాంధీనగర్ ప్రాంతాల్లో 150 మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సీతామహాలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

### ఘనంగా సినీనటుడు శోభన్‌బాబు జయంతి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏలూరు లాకుల సెంటర్‌లో స్టేట్‌వైడ్ శోభన్ సిండికేట్ ఆధ్వర్యంలో సినీ నటుడు శోభన్ బాబు 87వ జయంతి కార్యక్రమం జరిగింది. స్టేట్ వైడ్ శోభన్ సిండికేట్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ క్లోపల్లి మధుసూదనరాజు, డాక్టర్ డి.సత్యనారాయణలు శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పైడిపాటి వెంకన్న, ఆర్టిస్ట్ వెంకన్న, సలీం తదితరుపాల్గొన్నారు.

### రెండు బార్లలో రూ.33 వేల నగదు చోరీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమట పీఎస్ పరిధిలోని రెండు బార్లలో దొంగతనం జరిగింది. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగిందని పటమట పోలీసులు చెప్పారు. ఇందులో ఒక బార్‌లో రూ.18వేలు, మరొక బార్‌లో రూ.15 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని చెప్పారు. దొంగతనం జరిగిన వెంటనే పోలీసులు అక్కడకు వెళ్లి బార్‌ల యజమానుల నుంచి జరిగిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజలకు భోగభాగ్యాలు తెచ్చే భోగి



నున్న చినకంచిలో భోగి మంటలు



చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో బాలలకు భోగి పండ్లు పోస్తున్న తల్లులు



వడ్లు, నవధాన్యాలతో పూజలు

గన్నవరం రూరల్: ప్రజలకు భోగభాగ్యాలు తెచ్చేది భోగి పండగని వేద పండితులు భక్తులకు వివరించారు. మండలంలోని గ్రామాల్లో శనివారం భోగి పండగను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. యువత తెల్లవారుజామున భోగి మంటలు వేశారు. భోగి మంటల్లో నీళ్లు ఉంచి వేప కలసిన వేడి నీటితో స్నానాలు చేశారు. బాలలకు దేవాలయాల్లో పలుచోట్ల తల్లిదండ్రులు భోగి పండ్లు పోశారు. చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్ పురంలో శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలో బాలలకు భోగి పండ్లు పోశారు. బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. కొత్త వడ్లు, నవధాన్యాలు ఉంచి, చెరకు గడలు ఏర్పాటు చేసి పుష్పాలు, పండ్లతో కలశాలు నిర్మించారు. పాడి పంటలు సమృద్ధిగా పండి భోగభాగ్యాలను, సిరిసంపదలను ఇంటికి తెచ్చే భోగి పండగ జరుపుకుంటామని ఆలయ నిర్వాహకులు వంశీ తెలిపారు. పలు గ్రామాల్లో మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: జంక్షన్‌లో భోగి పర్వదినాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. రంగు రంగుల రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలతో ప్రతి వీధిలో సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. హనుమాన్‌జంక్షన్‌లోని పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ నివాసంలో జరిగిన వేడుకల్లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. బాపులపాడు మండలం అంపాపురంలో వంశీ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి వేడుకల్లోనూ భోగి సంబరాలు ఘనంగా జరిగాయి.

ఉంగుటూరు: తేలప్రోలులో ఎంపీటీసీ తియ్యగూర వాణి, ఉప సర్పంచ్ వింత ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే భోగి మంటలు వేసి కృష్ణుడికి భోగిపళ్లు సమర్పించారు. కార్యక్రమంలో వల్లభనేని శాంతివర్ధన్, పీఏసీఎస్ అధ్యక్షుడు తియ్యగూర రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శనివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలు, పాలపొంగళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలతో వాకర్స్ సందడి చేశారు. సంఘ అధ్యక్షుడు మడుపల్లి బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ...పండగ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం సంఘ వ్యవస్థాపకుడు టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, ముక్కామల సుబ్బారావు సంక్రాంతి పండగ విశిష్టతను వివరించారు. సంఘ కార్యదర్శి చిప్పాడ చంద్రశేఖరరావు, కోశాధికారి గంపా సాంబశివరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడరూరల్: నున్న గ్రామంలో ప్రసిద్ధ దేవస్థానం చినకంచిలో భోగిమంటలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించి పూజలు చేశారు. ప్రతి వీధిలో రంగవల్లులు, హరిదాసులు, గంగిరెద్దుల రాకలతో గ్రామాల్లో పండుగ వాతావరణం స్పష్టంగా కనిపించింది. కండ్రిక, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో భోగి మంటలను వేశారు.

**సంక్రాంతి సందడి**

కంకిపాడు: సంక్రాంతి పర్వదినాన్ని శనివారం ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. భోగి పండుగ సందర్భంగా ప్రజలు ఇళ్ల ముంగిట భోగి మంటలు వెలిగించారు. మహిళలు అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. హరిదాసులకు పిండివంటలు దానమిచ్చారు. సంప్రదాయబద్ధంగా కోడిపందేలు జరిగాయి. రైతువారీగా కోడిపందేలు నిర్వహించారు.

# ఘనంగా గోదాదేవి కల్యాణం



నున్నలో కల్యాణోత్సవం



శాంతి కల్యాణం చేస్తున్న పండితులు

నున్న(విజయవాడరూరల్): నున్నలో చినకంచి శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి దేవస్థానంలో శనివారం గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దావాజిగూడెం(గన్నవరం): దావాజీగూడెంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం శ్రీగోదాదేవి, శ్రీకృష్ణస్వామి శాంతి కళ్యాణం కనుల పండువగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి సుప్రభాతసేవ, అర్చన తర్వాత నగర సంకీర్తన, గొబ్బెమ్మ అలంకరణ, భోగి మంటలు, తిరుప్పావై సేవాకాలం జరిపారు. అనంతరం శ్రీగోదాదేవి, శ్రీకృష్ణస్వామిని పెళ్లికూతురు, పెళ్లికొడుకుగా అలంకరించి ఎదురుకోలోత్సవం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాంతి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులు నేతృత్వంలో ధనుర్మాస గోష్ఠి చేశారు.

పెనమలూరు: పెదపులిపాకలోని శ్రీ విజయరాజరాజేశ్వరి ఆలయంలో శనివారం శ్రీగోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీవాసుదేవనందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు చేశారు. తల్లం వెంకటసత్యదేవ్ దంపతులు, మాజేటి జగదీష్ బాబు దంపతులు కల్యాణాన్ని అత్యంత వైభవంగా చేశారు.

## నైనవరంలో ఇమ్యూనైజేషన్



టీకాలు వేస్తున్న ఏఎన్‌ఎం

పి.నైనవరం(విజయవాడరూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు నెలలో రెండో శనివారం పి.నైనవరంలో గర్భిణు 0-5 సంవత్సరాలు,10-16 ఏళ్ల వారికి వైద్య సిబ్బంది ఇమ్యూనైజేషన్ టీకాలు వేశారు. పోలియో, తట్టు లాంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా టీకాలు వేస్తున్నట్టు ఏఎన్‌ఎం జి.నవత తెలిపారు. 20 మందికి టీకాలు వేసినట్టు పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# అయ్యప్పకు ప్రత్యేక పూజలు



మకరజ్యోతి పూజలో డాక్టర్ దుట్టా, యార్లగడ్డ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడులో అయ్యప్ప స్వామి ఆలయంలో మకరజ్యోతి దర్శనం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన అన్నపూర్ణ ఏజెన్సీస్ అధినేత నూలు నరసింహారావు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథులు వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు, గన్నవరం మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మకరజ్యోతిని తిలకరించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి, గన్నవరం ఏఎంసీ మాజీ చైర్మన్ కోటగిరి వరప్రసాదరావు, చలమలశెట్టి రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు సుంకర సుభాష్‌చంద్రబోస్, వేగిరెడ్డి పాపారావు, అప్పనవీడు ఉప సర్పంచ్ అప్పక కనకదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: సంప్రదాయం ముసుగులో కోడిపందేలు, జూదం వైపు యువత చూడకుండా క్రీడాపోటీలు నిర్వహించటం అభినందనీయమని హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలో శనివారం కబడ్డీ, షటిల్ ఆటల పోటీలు నిర్వహించారు. బాపులపాడు, ఉంగుటూరు మండలాలకు చెందిన పలు జట్లు పాల్గొన్నాయి. కబడ్డీ పోటీల్లో ఆత్కూరు, వీరవల్లి జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. షటిల్ పోటీల్లో వీరవల్లి, హనుమాన్‌జంక్షన్ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ముఖ్యఅతిథులకు జంక్షన్ ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు, శేరినరసన్నపాలెం సర్పంచ్ అడపా అంజిబాబు చేతుల మీదగా బహుమతులు పంపిణీ చేశారు. నిర్వాహకుడు కమ్మిలి సూర్యనారాయణ మూర్తిని పలువురు అభినందించారు. విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు అక్కినేని రాఘవేంద్రరావు, వ్యాయామోపాధ్యాయుడు బొల్లెద్దు భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

## త్రిశక్తి పీఠంలో అమ్మవార్లకు విశేష పుష్పార్చన



కాళీమాతకు పుష్పార్చన

కృష్ణలంక(విజయవాడ తూర్పు): బస్టాండ్ సమీపంలోని కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో వేంచేసి ఉన్న శ్రీమహాకాళి, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు శనివారం విశేష పుష్పార్చన నిర్వహించారు. భక్తులు సమర్పించిన వివిధ రకాల పుష్పాలతో ఆలయ ప్రధానార్చకుడు వ్యాకరణం శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవార్లకు పుష్పార్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పుష్పార్చనలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు భారతుల విజయకిరణ్ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## కోడి పందేల నిర్వాహకులపై కేసు

పెనమలూరు: కోడి పందేల నిర్వాహకులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోడి పందేలు నిర్వహిస్తున్న యనమలకుదురు గ్రామానికి చెందిన ముంగమూరి శివరాజు, గంటా శేఖర్, రావూరి జగదీష్, చుండూరు ప్రకాష్, నెక్కలపూడి రాజేష్, వల్లభనేని విష్ణు, కానూరుకు చెందిన నాగధర్మేష్, బనవరపు రాజేష్, పొన్నం హర్షిత్, కె.శ్రీకాంత్‌ల పై పోలీసులు కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: తాడిగడప జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన సుగాలి మూడావత్ నితీష్‌కుమార్ నాయక్ బీటెక్ చదువుతున్నాడు.అతను సంక్రాంతి పండగ సందర్భంగా పోరంకిలో బంధువుల ఇంటికి వచ్చాడు. అతను శుక్రవారం రాత్రి కజిన్ లోకేష్‌తో బైక్ పై కానూరు పెట్రోల్ బంకు వద్దకు బయలుదేరాడు. అతను బందరురోడ్డు తాడిగడప జంక్షన్ సమీపంలోకి రాగా కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరూ గాయపడ్డారు. వారిని పోరంకిలో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## బాలిక అదృశ్యం

పెనమలూరు: యనమలకుదురులో బాలిక అదృశ్యం కావటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు రాయలవారి వీధికి చెందిన పీతా సాంబశివరావు కుటుంబం నివసిస్తోంది. అతని కుమార్తె (17) పది చదివి పప్పుల మిల్లు వద్ద షాపులో పని చేస్తుంది. అయితే గురువారం పనికని ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైంది. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెదికినా ఆమె జాడ తెలియక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

## ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు



ఆటోనగర్(విజయవాడ తూర్పు): సంక్రాంతి ముందు స్పెషల్ డ్యూటీ ఇష్టపడి చేసిన ప్రతి ఉద్యోగిని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు అభినందించారు. ఈ సందర్భంగా శనివారం ఆటోనగర్ డిపో ఆవరణలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఎండీ సందేశాన్ని డిపో డీఎం ప్రవీణ్‌కుమార్ ఉద్యోగులకు చదివి వినిపించారు. అదేవిధంగా సంక్రాంతి అనంతరం నాలుగు రోజులు కూడా సిబ్బంది అంకితభావంతో పనిచేసి, ఆర్టీసీ ఆదాయానికి కృషిచేయాలని ఆ సందేశంలో ఎండీ పేర్కొన్నారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం

గుడ్లవల్లేరు: సంక్రాంతిని పురస్కరించుకుని శ్రీ షిరిడీ సాయి మందిర మహిళా నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలను ఎంపిక చేసి ప్రోత్సాహ బహుమతులను డీటీ బి.కనకదుర్గ చేతుల మీదుగా అందజేశారు. ఆ మందిర అభివృద్ధి చైర్మన్ కానూరి బాలకృష్ణమోహన్(బాలు) ఆర్థిక సాయంతో గృహోపకరణాలను బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వడ్లమూడి శైలజ, బొబ్బా ఝాన్సీలక్ష్మి, వడ్లమూడి పద్మజ, పడమటి సుజాత, వడ్లమూడి సీతారావమ్మ, తూము ప్రమీలారాణి, చాపరాల విజయలక్ష్మి, క్లోపల్లి సుధారాణి పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 29వ డివిజన్ మధురానగర్ నేతాజీ కాలనీలో శనివారం కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ఎంపిక చేశారు. సాయంత్రం బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే, ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

## చల్లంరాజు సత్రం అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): రాష్ట్ర దేవదాయ శాఖ పరిధిలోని చల్లంరాజు వెంకటశేషయ్య ధర్మ సత్రం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. సత్రం వ్యవస్థాపకురాలు తుమ్మలపల్లి దుర్గమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని సత్రం ప్రాంగణంలో అధికారులు, పాలకవర్గం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు వస్త్రదానం, అనాథలకు దుప్పట్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలను ఎమ్మెల్యే వెలంపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ దాతల ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. నూతన పాలకవర్గం సత్రం అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. కార్యనిర్వహణాధికారి సత్యప్రసాద్‌బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు కార్పొరేటర్ యలకల చలపతిరావు, సత్రం పాలకవర్గ అధ్యక్షుడు వాసాబాబు, సభ్యులు నాగపావని, రుద్ర శంకర్, దుర్గాప్రసాద్, లక్ష్మీకుమారి, సుగుణ, అశోక్ పాల్గొన్నారు.

# కులమతాలకతీతంగా సంక్రాంతి వేడుకలు

లబ్బీపేటలో ముస్లిం సంక్షేమసమితి ఆధ్వర్యంలో నిర్వహణ



ముస్లిం సంక్షేమ సమితి ఆధ్వర్యంలో వేడుకలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కుల, మతాలకతీతంగా ముస్లింలు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. లబ్బీపేటలో ముస్లిం సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో కృష్ణలంక పోలీస్‌స్టేషన్ సీఐ ఎంవీ దుర్గారావు ముఖ్యఅతిథిగా హాజరు కాగా, గవర్నర్‌పేట స్టేషన్ సీఐ డి సురేష్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మతాలకతీతంగా ముస్లింల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం శుభపరిణామం అన్నారు. ముస్లిం సంక్షేమ సమితి అధ్యక్షుడు ముక్తార్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో 19వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ రెహానా నాహీద్, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీం, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ మీర్ హుస్సేన్, నాహీద్, ఎస్‌కే వలీ, ఆబిద్, అబ్బాస్, సుభానీ, జి.సాయి వినయ్‌కుమార్, దీపు, అశోక్, బుజ్జి, రాఘవేంద్ర, సిద్ధాంతి శర్మ, ఆల్ ఇండియా భవానీదీక్షల సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.